# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నిర్మాణాత్మకంగాను, అర్థవంతమైన చర్చలతోను జరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.
- జాతీయ ప్రయోజనాల పరిరక్షణ.. పార్లమెంట్ సభ్యుల సమష్టి బాధ్యత అని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అన్నారు.
- ఓడరేవులను ఆధునీకరించడం, వాటి సామర్థ్యాలను పెంచడమే సాగరమాల కార్యక్రమం లక్ష్యమని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు.
- ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం ఫలితంగా నిర్వహణ సరళీకృతం అవుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.
- ముంబై రైలు పేలుళ్ళ కేసుకు సంబంధించి 12 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ.. హై కోర్టు ఈరోజు తీర్పునిచ్చింది.

================================

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నిర్మాణాత్మకంగాను, అర్థవంతమైన చర్చలతోను జరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ఈరోజు ఉదయం ప్రధానమంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేలా సభ్యులంతా సహకరించాలని కోరారు. "ఆపరేషన్ సిందూర్" అంశాన్ని ప్రస్తావించిన ఆయన.. భారత సైనిక శక్తి, బలాన్ని ప్రపంచం చూసిందని, సైనికులు తమ లక్ష్యాలను కేవలం 22 నిమిషాల్లోనే పూర్తి చేశారని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ.., వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్ పాత్రను బహిర్గతం చేయడానికి సహకరించారని ప్రశంసించారు.

(వాయిస్ 30 సెకన్లు)

అలాగే UPI అనేక దేశాలలో ప్రజాదరణ పొందుతోందని నరేంద్ర మోదీ అన్నారు. భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా ముందుకు వెళుతోందని ప్రధానమంత్రి ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ ప్రయోజనాల పరిరక్షణ.. పార్లమెంట్ సభ్యుల సమష్టి బాధ్యత అని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో సభ సజావుగా సాగేందుకు సభ్యులంతా సహకరించాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన విజ్ఞప్తి చేశారు. సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి లక్ష్యాల సాధన కోసం సభ నిర్దిష్ట చర్యలు తీసుకునేలా చర్చల్లో పాల్గొనాలని సభ్యులకు ఆయన పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగరమాల కార్యక్రమాన్ని చేపట్టామని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఈ రోజు రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. సాగరమాల కార్యక్రమం కింద 805 ప్రాజెక్టులను గుర్తించి, వాటి కోసం 5.5 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఓడరేవులను ఆధునీకరించడం, వాటి సామర్థ్యాలను పెంచడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలోని అన్ని ప్రధాన ఓడరేవులు రైల్వే, రోడ్డు మార్గాలతో అనుసంధానించబడి ఉన్నాయన్నారు. 2047 నాటికి ప్రపంచంలోని 5 అత్యున్నత షిప్ బిల్డింగ్ దేశాలలో భారత్‌ను ఒకటిగా తీర్చిదిద్దాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అలహాబాద్ హై కోర్టు ప్రస్తుత న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఈరోజు పలువురు పార్లమెంటు సభ్యులు మెమోరాండం సమర్పించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217, 218 కింద అభిశంసన తీర్మానంపై మొత్తం 145 మంది లోక్‌సభ సభ్యులు సంతకం చేశారు. సంతకం చేసిన వారిలో బీజేపీ, కాంగ్రెస్ సహా వివిధ పార్టీల ఎంపీలు ఉన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నగదు రికవరీకి సంబంధించిన విషయంపై పార్లమెంటు విచారణ జరుపుతుంది. అలాగే.. జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించాలని కోరుతూ ఒక తీర్మానం అందుకున్నట్టు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (RRB)ల విలీనం ఫలితంగా నిర్వహణ సరళీకృతం అవుతుందని, సేవలందించడంలో సౌలభ్యం పెరుగుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈరోజు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ఒక ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిస్తూ... ఒక రాష్ట్రం.. ఒక RRB.. సూత్రాన్ని అనుసరించి, కేంద్ర ప్రభుత్వం RRBల ఏకీకరణ ప్రక్రియను కొనసాగించిందని చెప్పారు. దీని ద్వారా 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో RRBల సంఖ్య 43 నుండి 28కి తగ్గించబడిందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబైలో 2006వ సంవత్సరంలో జరిగిన రైలు పేలుళ్ళ ఘటనకు సంబంధించి ముంబై హైకోర్టు ఈరోజు తీర్పు వెలువరించింది. నాటి పేలుళ్ళ ఘటనలో 189 మంది మరణించగా మరో 800 మందికి పైగా గాయపడ్డారు. సుదీర్ఘ కాలం జరిగిన దర్యాప్తు అనంతరం ప్రత్యేక కోర్టు 2015వ సంవత్సరంలో 12 మంది నిందితులను దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పుపై దోషులు మహారాష్ట్ర హై కోర్టును ఆశ్రయించగా అప్పటి నుండి ఈ కేసు హైకోర్టులో కొనసాగుతోంది. దీనిపై 2024వ సంవత్సరంలో ఏర్పాటైన ధర్మాసనం విచారణ జరిపి, ఈ 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ... ఈరోజు తీర్పును వెలువరించింది. కాగా.. నిందితులను దోషులుగా ప్రకటించడంలో ట్రయల్ కోర్టు లోపభూయిష్టంగా వ్యవహరించిందని, అలాగే నిందితులపై అభియోగాలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని ముంబై హైకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB) పారదర్శకంగా దర్యాప్తు నిర్వహిస్తోందని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈరోజు రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ... దర్యాప్తునకు సంబంధించిన తొలిదశ పూర్తయ్యి, ప్రాథమిక నివేదిక సమర్పించడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియ మొత్తం అంతర్జాతీయ ప్రమాణాలతో జరుగుతోందని, సంబంధిత అంతర్జాతీయ నిపుణులు, వాటాదారుల ప్రమేయంతోనే కొనసాగుతోందని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి కొన్ని భారతీయ పత్రికా సంస్థలతో పాటు పాశ్చాత్య మీడియా కూడా తమ సొంత అభిప్రాయాలను ప్రచారం చేయడాన్ని తాను గమనించినట్టు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కైరోలోని బ్లాక్ బాల్ స్పోర్టింగ్ క్లబ్‌లో ఈరోజు ప్రారంభమైన ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో 12 మంది సభ్యులతో కూడిన భారత బృందానికి అనహత్ సింగ్ నాయకత్వం వహిస్తున్నారు. 6 రోజుల పాటు జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రపంచంలోని 234 మంది అగ్రశ్రేణి అండర్ -19 క్రీడాకారులు పాల్గొంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు రోజుల్లో కర్ణాటక తీరప్రాంతం, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =